
# మరిచిపోకు సుమా!



-గుజ్జేటి గణేష్

తాళం తీసి ఇంట్లో అడుగుపెట్టిన ఆనంద్‌కు ఎదురుగా టీపాయ్ పై , పేపర్ వేట్ పెట్టిఉన్న తెల్లని కాగితాలు రెపరెప లాడుతూ దర్శనమిచ్చాయి.

వాటిని చూస్తూనే లిప్తపాటు విద్యుత్ ఘాతం తిన్నవాడిలా స్థంభించిపోయాడు. మనస్సు ఏదో కీడు శంకించింది.



గబగబా ఇంట్లోకెళ్ళి గదులన్నీ చూసాడు. భార్య తాలూకు ఏ ఒక్క వస్తువు కూడా అగుపించలేదు.

వెంటనే హాల్లోకొచ్చి, టీపాయ్ పై ఉన్న కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు. అది తనను సంబోధిస్తూ వ్రాసిన ఉత్తరమే అయినా, రెండు అరఠావు కాగితాలకు ఇరు ప్రక్కలా వ్రాసి ఉంది.

ఆతృతగా ఆనంద్ కళ్ళు అక్షరాల వెంట పరుగులు. తీయసాగాయి....

"ఆనంద్‌గారూ.......!

బహుశా ఈ పరిస్థితిలో ఇంతకంటే మించి మిమ్మల్ని సంబోధించే యోగ్యత నాకు' లేదేమో! నా సంబోధన మీకు బాధ కలిగిస్తే క్షంతవ్వురాల్ని!

చూడండి! ఇన్ని రోజులూ మీ తిట్లనూ,కొట్లనూ ఎంతో ఆత్మవంచన చేసుకొని...... మునుముందు మీలో మార్పు రాకపోతుందా అన్న ఆశకు ప్రాణం పోస్తూ, భరిస్తూ వచ్చాను.

కాని, రాత్రి మీరన్న ఆ మాటల్నీ, ఆ చేష్టల్నీ మట్టుకు భరించలేకుండా ఉన్నాను!

బహుశా మీ మాటలూ, మీ చేష్టలూ నాలోని ఆత్మ స్థైర్యాన్ని నిలువునా కాల్చి చంపాయేమో! అందుకే, ఈ ఖండిత నిర్ణయానికి వచ్చాను.

నా నిర్ణయానికి ప్రతీకే.... ఈ సంబోధన... ఈ ఉత్తరమునూ....,

మీరు ఈ ఉత్తరం చదివే వరకు నేను ఇక్కడ అంటే ఈ పట్టణంలో ఉండను. ఎక్కడికి వెళ్ళాలో... ఏమి చేయాలో, ఇంకేమీ నిర్ణయించుకోలేదు.

ఒకటి మాత్రం నిజం! నాకంటూ ఎవరు అప్పులు లేరన్న పిరికి తనంతో ఆత్మహత్య మాత్రం చేసుకోను. ఆ పిరికి తనమే నాలో ఉండి ఉంటే.... మీ చేత అనుమానింపబడి, ఆత్మహత్య సద్రుశమైన తిట్లు తిన్న మొదటి రోజే చేసుకొని ఉండేదాన్ని.

ఇప్పుడే కాదు...... మరెప్పటికీ కూడా అలాంటి పిరికి తనానికి చోటు లేదు నాలో!

ఒకవేళ పిరికి తనంతో ఆత్మహత్య చేసుకుంటే, నేను చచ్చి మీ దగుల్బాజి తనానికి ప్రాణంపోసిన దాన్నవుతాను.

నేను ఒకరికి మార్గ దర్శకురాలిని కావాలన్న ఆశతో కాకుండా.... ఏ పట్టుదలతో, ఏ ఖండిత నిర్ణయంతో, ఏ ఆశయంతో మొండిగా తలెత్తుకె బ్రతకాలన్న సంకల్పంతో మీ నుంచి దూరమవుతున్నానో, వాటి కొరకైనా ఆత్మ వంచన చేసుకోకుండా ధైర్యంగా నిలబడతాను.

చివరి ఊపిరి వరకు జీవన పోరాటం సాగిస్తూనే ఉంటాను.

"ఇంత ధైర్యం ఉండబట్టే నా....... ఇన్ని రోజులూ నా తిట్లనూ, కొట్లనూ భరిస్తూ పడి చచ్చింది"అని మీరు అనుకుంటుండవచ్చు!

కాని, మొరిగే కుక్కపై మరో రాయి విసిరే మనస్తత్వం కాదు నాది! అందుకే, విసుగెత్తి మీరే ఊర్కుంటారని నేను పట్టించుకోకుండా ఇన్ని రోజులు ఓపిక పట్టాను.

అయినా, మీలో కించిత్తు మార్పు రాలేదు సరికదా, నన్ను ఈషణ్మాత్రం కూడా అర్థం చేసుకోలేదు.

అయినా, ఎలా అర్థం చేసుకుంటారు!? మీ దృష్టిలో ఆడది ఓ యంత్రం! మీరు కోరినప్పుడు నోరు మూసుకొని లొంగిపోవాలే తప్ప- ఏలాంటి బాధనూ, విముఖతనూ, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించకూడదు.

ఒకవేళ అభిమానంతో తెగించి నోరు చేసుకుంటే...... నిర్భయంతో, నిర్లక్ష్యంతో, పరాయి మగవాడి వ్యామోహంతో మాట్లాడినట్లు... కదూ!?

అదంతా మీ అపోహ మాత్రమే!

చూడబోతే మీకు బాగా శృంగార సాహిత్యం ఒంటబట్టినట్టుంది. అందులో మల్లే కట్టుకున్న భార్య కూడా మిమ్మల్ని రెచ్చగొట్టాలి.... రసికపు మాటల్తో కవ్వించాలి!

అప్పుడైతే భర్తపట్ల ప్రేమానురాగాలు, భక్తి భావనలు ఉన్నట్లు కదూ?

చూడండి! అదంతా కథల మట్టుకు, నవలల మట్టుకే గానీ, నిజ జీవితంలో కూడా అలా జరుగుతుందనుకోవడం జరగాలనుకోవడం శుద్ధ తెలివి తక్కువే!

మీకు తెలుసో లేదో....... శృంగార సాహిత్యంలోని స్త్రీ పాత్రలకు మల్లే, రోజూ సంతృప్తి పడాలన్న వేడి కోరికలు, ఆవేశాన్ని అణచుకోవాలన్న కండకావరం ఏ స్త్రీకీ.... ఏ గృహిణికీ ఉండవు!

ఈ విషయం ఎన్నటికీ మర్చిపోకండి!!

ఆనంద్ గారూ! మీ పేరుకు దగ్గట్టుగా మన కాపురంలో కూడా ఎల్లప్పుడు 'ఆనందం'తులతూగుతుందని కొత్తలో ఎన్నో కలలు కన్నాను.

కానీ, రెండు నెలలు కూడా తిరకముందే మీరు నాపై చేయి చేసుకున్న మొదటి రోజే, నా కలలు కల్లలుగా మారాయి.

అయినా, నా మనస్సుకు ధైర్య సాంత్వన వచనాలు చెప్పుకొని 'భర్త చేయి చేసుకోవడంలో తప్పేముంది' అనుకొని ఊర్కున్నాను.

కానీ, రాను రాను మీ ప్రవర్తన మరీ విషమించిపోయింది. నోరు హద్దు లేకుండా పారేసుకోసాగారు. చీటికీ మాటికీ, సూటిపోటి మాటలంటూ....., నోరు కదిపితే చేయి చేసుకుంటూ నన్ను క్షోభ పెట్టసాగారు.

మన పెళ్ళయిన ఈ ఏడాది కాలంలో ఏనాడైనా, మీ మాట కాదన్నానా, మీ కోరికను విస్మరించానా!

కానీ, రాత్రి జ్వరంచేసి నేను ఎంత నీరసంగా, నిస్సత్తువగా ఉన్నానో ఆ దేవునికే తెలుసు!

అందుకే........ ఓపిక లేక నా దీనావస్థను విన్నవించుకొని ప్రాధేయపడ్డాను.

కానీ,..... నా అభ్యర్థనను మరోలా భావించుకున్నారు! అపార్థం చేసుకొని ఉంపుడు గత్తె అన్నారు!

మరో ప్రేమికుని జ్ఞాపకాల్లో తల మునకలవుతున్నానన్నారు.!

నానా రుచులకు అలవాటు పడ్డానన్నారు.

ఇంకెన్నో విధాల తిట్టిపోసి అయినా ఊర్కున్నారా!? లేదే... మీ లంపటత్వపు పిపాస తీర్చుకొని మరీ వదిలారు!

చూడండీ! ఎలాంటి స్పందన, భావుకతలు లేక బండబారిపోయిన నా శరీరం నుండి మీరు ఎంత అనుభూతి, ఆనందం పొందారో నాకు అర్థంకావడం లేదు!

ఆనంద్ గారూ! పుట్టలో చేయిపెట్టి పామును పట్టాలనుకోవడం ఎంత అవివేకమో నాకు బాగా తెలుసు! అందుకే, రాత్రి మీ మాటలకు ఎదురు చెప్పడం గానీ, మీ చేష్టల్ని ప్రతిఘటించడం గానీ చేయలేదు.

మీ మగవారు ఎన్ని ఆదర్శాలు వల్లించినా, ఎంత ఉదారతను ఒలక బోసినా..... అవన్నీ అమలు పర్చనివేనని స్వార్థం, మోసం, అనుమానం, అధికారదర్పం మీ నర నరాల్లో జీర్ణించుకుపోయి ఉంటాయని..... సమయమొస్తే మొదట బయట పడేది మీ మగవారేనని, మీరు రాత్రి మరో సారి రుజువు చేశారు.!

ఈ విషయంలో మీకు ఏమయినా సంశయముంటే... రాత్రి సంఘటన స్ఫురణకు తెచ్చుకొని నిదానంగా ఆలోచించండి!

కాకపోతే..... నేను ఇలా ఇల్లు విడిచి వెళ్తున్నందుకు కూడా మీకేమీ అపకీర్తి రాదు. 'అమ్మో ఎంతటి జాణ! ఒళ్ళు మదమెక్కి నానా రుచులకు అలవాటు పడి కట్టుకున్న వాణ్ణి వదిలేసి లేచిపోయింది'అని లోకం నాపైనే దుమ్మెత్తి పోస్తారు.

ఎందుకంటే.... మీరు లోకం దృష్టిలో ఆదర్శ స్వభావులూ, ఉదార పురుషులు గనకా! నన్ను లోలోన హింసిస్తూ కూడా సమాజంలో ఎంతో సంస్కారంగా, నీతిగా చెలామణి అవుతున్నారు గనకా!

ఒక్క విషయం! మీరు అప్రతిష్ట పాలు కాకుండా.... మీ పరువు బజారున పడకుండా కాపాడింది ఈ ఆడదే అన్న సత్యాన్ని మాత్రం మరిచిపోకండి!

ఒకవేళ నేనుకూడా మీలా... ఓర్పు, సహనం లేని దుడుకు స్వభావురాలినై ఉంటే, ఈ రోజు మీరు సమాజంలో తలెత్తుకు తిరిగే వారు కాదు.

మీకు కాస్తయినా ఇంగిత జ్ఞాన మనేది ఉంటే, ఆడ జాతిలో ఎంతటి ఓర్పు, మనస్థైర్యం, విశాల హృదయం నిగూఢమై ఉంటాయో.... ఇప్పుడైనా అర్థం చేసుకోండి!

అలా అర్థం చేసుకొని స్త్రీ జాతిపట్ల సానుభూతి చూపి కన్నీరు కార్చమనడం లేదు. ఆ స్థాయిని ఎప్పుడో తలదన్ని మగవారికి తీసి పోకుండా ఎంతో ఎదిగిపోయింది నేటి మహిళా లోకం.

అందుకని . మీతో సమానమైన సాటి మనిషిగా భావించి గౌరవించండి! అంతే చాలు!!

ఆనంద్ గారూ! 'ఈ సోది అంతా ఏంటా'అని మీకు విసుగెత్తుతుండవచ్చు. కాని, నేను వ్రాస్తున్న ఈ ఉత్తరంలోని ప్రతీ విషయం సూచన మీలాంటి వారికి తప్పక అవసరం.

ఎందుకంటే... ఇప్పుడు నేను మీనుంచి దూరమైనంత మాత్రాన, మీరు మడి గట్టుకొని ఏక పత్నీవ్రతుడిలా ఉండిపోరే?! మరో వారంపదిహేనురోజులకో, నెలా రెన్నెల్లకో మరో ఆడదాన్ని...ఏదో ఒక విధంగా పెళ్ళాడ్తారు! ఆమెను కూడా శత విధాల హింసించి ఉసురు పోసుకుంటారు.

అందుకని...ఒకవేళ ఈ ఉత్తరం మూలంగానైనా, మీలో కాస్తయినా మార్పు వస్తుందేమోనన్న ఆశతో, ఇంత ఉపోద్ఘాతం వ్రాస్తున్నాను.

చూడండి! మనిషి దేన్నైనా భరించగలడు .కానీ, అనుమానాన్ని మాత్రం భరించలేదు.

ఆ అనుమానం పెనుభూతమై తరుముతుంటే..... తెగించి ఏ పనికైనా తల పడ్తాడు., సంస్కారాన్ని కోల్పోయి మూర్ఖంగా ప్రవర్తిస్తాడు. దానవుడిలా మారి ఎదుటి వారిని బలిగొనడానికి కూడా వెనుకాడడు!

అందుకే, మీకు ఆ పిచ్చి పట్టక ముందే మీ నుంచి దూరమవుతున్నాను.

సెలవు-"!

ఉత్తరం పూర్తిగా చదివిన ఆనంద్ మెదడులో రైళ్ళు పరుగెత్తసాగాయి. మస్తిష్కంలో ఏదో తెలియని వింత అలజడి చెలరేగింది. ఆత్మప్రబోధంతో నిజాన్ని గ్రహించిన దానికి ప్రతీకగా హఠాత్తుగా కళ్ళు అశ్రు పూర్ణాలయ్యాయి.

అంతే, శరీరంలోని శక్తినంతా ఏదో అదృశ్య హస్తం లాగేసినట్టు ఒక్కసారి నీరసించిపోయి శిలా ప్రతిమలా సోఫాలో చతిగిల పడిపోయాడు.

-గుజ్జెటి గణేష్
ఏ.పి.యస్. ఆర్టీసీ,
ఆర్మూర్.